కథ:

# మాతృ దేవోభవ

## ఆర్. వసుంధర

అమ్మ చచ్చిపోతోందన్న టెలిగ్రాం చూచుకొని బయల్దేరి వచ్చాను. కాని తీరావచ్చాక, ఎందుకువచ్చానా అన్పించింది. ఎందుకు వచ్చానో అర్థంకాలేదు. వార్త వినగానే మనసులో ఏదో తెలియని అశాంతి, ఆవేదన రేగింది. ఏడుపు మాత్రంకాదు. ఆ అశాంతిలోనే, ఆలోచించకుండానే కాలేజికి సెలవుపెట్టేసి హైద్రాబాదునుండి బయల్దేరి వచ్చేశాను. అమ్మ చచ్చిపోతున్నదన్న మాట నిజమే, ఎన్నాళ్ళబట్టో చచ్చిపోతోంది. యిప్పుడు చావు మరీ దగ్గరకు వచ్చింది. రేపో ఎల్లుండో నిశ్చయంగా చచ్చిపోతుంది.

కమల దగ్గర్లోనే వుంది. పరిస్థితి విషమించిందని కబురు తెలియగానే కమలా, రంగా పిల్లల్తో వచ్చారు. వచ్చాక రంగ నాకు టెలిగ్రాం యిచ్చాడు. వెంటనే బయల్దేరి వచ్చాను. కాని తీరా వచ్చాక, యిప్పుడే రావటం అనవసరమనిపించింది. అమ్మకూ నాకూ మొదట్నుండీ సంబంధంలేదు. అమ్మకు కమల ఒక్కతే కూతురు, నాకు అమ్మ ఎప్పుడూ లేదు. మరి వెంటనే ఎందుకు బయల్దేరాను? లోకంకళ్ళు తుడవటానికి కర్మలప్పుడు వచ్చినా సరిపోయివుండేది, అనుకున్నాను.

అందరూ హడావుడిగా నిశ్శబ్దంగా తిరుగుతున్నారు. యింటికే చావుకళ వచ్చింది. అమ్మ మగతగా యీ లోకంలో లేకుండా కళ్ళు సగం తెరుచుకొని అర్థ శూన్యంగా చూస్తూ పడుకుని వుంది.

వచ్చినప్పటి నుండీ నాకు బోనులో పెట్టినట్లుగానే వుంది, ఏమీ తోచటం లేదు ఏమో తెలియని, ఒక్క చోట కుదురుగా వుండనివ్వని అశాంతి! సాయంత్రం అయ్యేసరికి యింట్లో వుండ బుద్ధి కాలేదు. మామిడి తోట చూసివస్తానని బయల్దేరాను. 'యిప్పుడెందుకూ?....' అన్నాడు రంగ మందలింపుగా, చిత్రంగా చూస్తూ.

'నాకేం తోచటం లేదు.... అప్పుడే ఎందుకు రమ్మన్నావ్ నన్ను?' అన్నాను.

'అత్తయ్య శారద ఏదీ? అనడిగింది. అందుకని....' అన్నాడు.

'ఓహో' అన్నాడు నిర్లక్ష్యంగా.

తోటకు వెళ్తుంటే నాలో మళ్లీ అశాంతి తలెత్తింది. అర్థంకాని అశాంతి! దోవలో చుక్కమ్మ కన్పించింది. ఏడుపు మొహంపెట్టి, 'అమ్మకెట్లుందమ్మాయ్?' అన్నది.

'అట్లాగేవుంది' అన్నాను.

'ఎన్నాళ్ళు సెలవుపెట్టి వచ్చావ్?' అన్నది.

'వారం రోజులు' అనేసి నడకసాగించాను. చుక్కమ్మ ఎంతసేపయినా మాట్లాడగలదు.

వెనకనుంచే 'తోట దగ్గరికా? ఎందుకూ? ఏంచేస్తావ్?' అన్నది.

విననట్లుగా వచ్చేశాను. ఏం చేస్తాను? నేను పుట్టినప్పటినుండీ ఏమీ చెయ్యలేదు. చెయ్యటం చేతకాలేదు.

తోట నానుకునే స్మశానం వుంది, మా కుటుంబానికి ప్రత్యేకమయిన స్మశానం దానిపేరు 'పాపడి బొందలు'. ఎన్నో తరాల్నుంచీ మా పూర్వులందరూ అక్కడే దహనం చెయ్యబడ్డారు. నాన్నగారూ అక్కడికే పోయారు. రేపు అమ్మకూడా అక్కడికే పోతుంది.

అమ్మ వెళ్ళబోయే చోటును చూద్దామని రాలేదు నేను ఆ తోట దగ్గరికి. నాన్నగారు వెళ్ళిన చోటును చూద్దామని ఎప్పుడైనా వస్తుంటాను.

ఆ నిర్జన ప్రదేశంలో, ఆ కుప్పల మధ్యన, 'గంటలో కాలిపోయాడు' పుణ్యాత్ముడు' తోటలో అంటుమామిడి చెట్టుక్రింద కూర్చుని, బొందల్లోకి చూస్తూ, నాన్నగారికోసం వెతుకుతాను. మనసులో వూహాస్తంభించి పోయినప్పుడు నాన్నగారు వున్నట్లుగానే, కొరతలేకుండా, హాయిగావుంటుంది.

నాన్నగారు చచ్చిపోయినప్పుడు నేనులేను, అకస్మాత్తుగా పోయారు. నేను హైద్రాబాదునుండి వచ్చేసరికి దహనంకూడా అయిపోయారు. 'అంతబ్రతుకు బ్రతికిన పుణ్యాత్ముణ్ణి పాచిశవంగా రాత్రికి వుంచెయ్యకూడదు' అన్నారట మామయ్య-కమల మామగారు.

సంగతి తెలియగానే నాకు గుండె పగిలి పోతుందేమోనన్పించింది. వారం రోజులు నిర్విరామంగా ఏడ్చాను. నాన్నను నాకు చూపించని అందరిమీద కసి పుట్టుకొచ్చింది.

పిచ్చెక్కిపోతుందేమో అనుకున్నాను. యిహ పిచ్చెక్కదనే నమ్మకం కలగటానికి మూడేళ్ళు పట్టింది. యీ మూడేళ్ళలోనూ మనస్థిమితంకోసం చాలా ప్రయత్నంచేశాను. సైకియాట్రిస్టును చూశాను. స్వాములవార్లను చూశాను. మామూలు డాక్టర్ల విషయం లెక్కలేదు. ఎవరిని చూసినా ప్రయోజనం లేకపోయింది.

అందరివీ వట్టిమాటలు! ప్రాణంలేని, సంబంధంలేని, మెట్ట వేదాంతం. 'సంబంధం' లేని వాళ్ళు ఎట్లా సహాయం చెయ్యగలరు? చెయ్యగలరనుకోవటం భ్రమ అని తెలుసుకొన్నాను.

ఈ ప్రపంచంలో నాతో సంబంధం వున్న ఒక్క మనిషి 'నాన్నగారు' ఎవరేమి చెప్పినా నా 'నాన్న' శవాన్ని నేను చూడకుండా ఎట్లా దహనం చేశారు? ఎవరికీ అట్లా చెయ్యడానికి హక్కులేదు. అమ్మకు తప్ప. నేను ముఖ్య వారసురాల్ని. పెళ్లయి పోయిన కమల లెక్కేమిటి?

అమ్మ నామీద కక్షతో కావాలని యిలా చేసిందేమో! అనిపించింది. కాని ఆమెకు నామీద కక్షకూడా లేదని జ్ఞాపకం వచ్చి చప్పబడ్డాను.

నేను గుర్తెరిగినప్పటి నుండీ ఆమెకు నాతో ఏ'సంబంధమూ' లేదు! ప్రేమ లేదు, ద్వేషం లేదు. ఆమె ముద్దుమురిపెమంతా కమలదగ్గరే. ఆమె తెలిసీ నాకేమైనా అన్యాయం చేసిందని నేను అనటం లేదు. నిజం చెప్పాలంటే న్యాయంగానే నిష్పక్ష పాతంగానే వుండాలని ప్రయత్నించిందను కుంటాను. 'న్యాయం' ఎవరికెక్కావాలి, 'సంబంధం' లేక పోయాక?

ఆమె ఎప్పుడూ నాలో ప్రతిస్పర్ధనే రేకెత్తించింది. దానికి పూర్తిగా అహం భావ పూరితమైన ఆమె గుణమే కారణమో, నా బాధ్యతకూడ వున్నదో యిప్పటికీ చెప్పలేను. కారణమేదైనా ఫలితంమాత్రం ఆమెకూ నాకూ మధ్యన సంబంధం తప్పి పోవడం. చిన్నపిల్లగావున్నప్పనుండీ కూడ ఆమె ప్రేమాభిమానాలకోసం ఆత్మగౌర వాన్ని చంపుకొని పాటుపడలేదు నేను. ఒక రకంగా అమ్మ అహంభావమే నాకూ సంక్రమించిందేమో! కాని చిన్నపిల్లగా అమ్మ ఆదరంకోసం, మెప్పుకోసం పాటు పడకపోయినా, వాటికోసం ఎదురుచూడ్డం, ఆశించడం నాకు గుర్తే. అది నాకు లభించలేదు.

నా సుఖ దుఃఖాల్లో ఆమె ఎప్పుడూ పాలుపంచుకోలేదు. క్రిందపడి దెబ్బ తగిలించుకున్నాను. వెంటనే డాక్టరు దగ్గరకు పంపించి కట్టు కట్టించింది. నొప్పికి ఏడ్చినప్పుడు 'తగిలించుకున్నప్పుడు ఓర్చుకోవాలి మరి' అన్నది. నొప్పితో సంబంధం పెట్టుకోకుండా, దూరంనుంచీ ... టైఫాయిడ్ జ్వరం వచ్చింది. జాగ్రత్తగా వేళకు మందు పోసింది. పాలూ జావా యిచ్చింది. ఏ నర్సుగాని అంతకంటే ఎక్కువ చెయ్యలేదు. కాని 'సానుభూతి' లేదు. తన విధ్యుక్తధర్మాన్ని న్యాయంగా ఆచరిస్తుంది. క్లాసులో ఫస్టు మార్కులు తెచ్చుకున్నాను. 'ఒక్కసారి ఒస్తే చాలనుకోకు. ఎప్పుడూ రావాలి. బాగా చదువు' అని ఆజ్ఞాపించింది. ఏ విధంగానూ ఆమెను నేను 'స్పృశింప' లేక పోయాను. క్రమేణా ఆ ప్రయత్నం విరమించుకున్నాను.

నాన్న అట్లా కాదు. నా నొప్పితో నొప్పిపడ్డారు. నా మార్కులికి సంతోషించారు నాకు మార్కులు తక్కువైనా ఏమీ అనివుండరు। నాన్న దేవుడు. అమ్మ నాన్నగారిని సరిగా చూడదనీ, నాన్నంటే నిర్లక్ష్యమనీ అభిప్రాయం నాకు ఎందుకు ఎట్లా కలిగిందో తెలియదు. నిజం చెప్పాలంటే నేను అలా అనుకోవటానికి కారణం కూడా లేదు. కానీ అనుకున్నాను. నాన్నను సంతోషపెట్టే భారం నామీద వేసుకున్నాను. కష్టపడి చదివాను. నాన్నగారికి కొడుకులు లేని లోపం తీర్చాలని నేనే కొడుకునై చదివాను. వుద్యోగంలో చేరాను. నాకు వుండే వుద్యోగావకాశాల గురించీ, అందులో పైకి పోగల అవకాశాల గురించీ, హైదరాబాద్‌లో గవర్నమెంటులోనుతో నేను కొనవలసిన యింటి గురించీ వూహాగానంచేసి, ఆశించి, సంతోషించాను. ఎందుకంటే నాన్నగారు నాతో సంతోషిస్తారు గనుక। పెళ్ళి విషయం తలపెట్టనే లేదు. నేను చేసుకోనని స్పష్టంగా చెప్పేశాను. నేను లేకుంటే నాన్నగారికి కొడుకెట్లా వుంటాడు? అందుకే యిప్పుడు ముప్పై మూడేళ్ళ కుమారి శారద, వైస్ ప్రిన్సిపాలెను.

కమలను మా మేనత్త కొడుకు రంగనాథాని కిచ్చి పెళ్లి చేశారు. ముగ్గురు పిల్లలు రంగ అమెరికాలో పి. హెచ్. డి. చేశాడు. తిరుపతి యూనివర్సిటీ కాలేజిలో ప్రొఫెసర్—యింత చిన్నవయస్సులోనే. నా కంటే ఏడాది చిన్న. నాన్నగారు మినహాగా యీ లోకంలో నిజంగా నా క్షేమం అభిలషించే వ్యక్తి రంగ ఒక్కడే ననుకుంటాను. మొదట్నుండీకూడా నాకూ రంగకీ మధ్యన అక్కా తమ్ముళ్ళ మధ్యన వుండే అంతరంగిక మైన సంబంధం, సానుభూతి ఏర్పడ్డాయి. అటువంటి రంగ కమల భర్త కావటం చాల సంతోషం కల్గించింది. కాని కమల రంగ విలువ తెలుసు

కోలేకపోతోందనీ, రంగకు అన్యాయం జరుగుతోందనీ అన్పిస్తుంది అప్పుడప్పుడు.

మామిడితోటనుంచి యింటికి వచ్చేసరికి చీకటిపడుతోంది. ఇంట్లోంచి ఏడుపులు వినరాలేదు. అమ్మ యింకా చచ్చిపోలేదన్నమాట.

'ఇంతసేపూ ఒంటరిగా ఆ తోటలో ఏం చేస్తున్నావ్?' అన్నది కమల.

'చీకట్లో పాములూ అవీ వుంటాయి' అన్నాడు రంగ చిరునవ్వుతో.

'పాములు నన్నేం చేస్తాయి!' అన్నాను.

కమల విసుక్కుంటూ పిల్లలకు అన్నంపెట్టటానికి వెళ్ళింది.

'పెళ్ళి చేసుకోరాదూ' అన్నాడు రంగా.

అప్పుడప్పుడు యిదే సలహా యిస్తూవుంటాడు. నాకు నవ్వు వచ్చింది.

"తప్పుకదూ. అమ్మ చచ్చిపోతుంటే యిదేనా ఆలోచించవలసినది? ఎవరైనా వింటే ఏమంటారు?" అన్నాను నవ్వుతూ. 'నీకుతెలిసిన ఒక సుబ్బారావు హైదరాబాదులో సెక్రెటేరియట్ లో వున్నాడు. ఈ మధ్యన యిదే సలహా యిచ్చాడులే—తనను పెళ్లాడమని....' నవ్వేశాను.

రంగ నవ్వకుండా ఆలోచించాడు. 'ఎవరబ్బా' అన్నాడు. జ్ఞాపకంవచ్చాక 'వాడా? వాడికి పెళ్లయిపోయింది. అరడజను మంది పిల్లలుకూడాను....కొంపతీసి వాడిని చేసుకోవాలనుకుంటున్నావేమిటి? .చాలా selfish fellow...' అన్నాడు ఆదుర్దాగా.

రంగ ఆదుర్దా చూసి నాకు మరీ నవ్వువచ్చింది. 'యిన్నేళ్ళు వచ్చాక పెళ్ళి కాని వాడు ఎక్కడ దొరుకుతాడు నాకు?....సుబ్బారావు నా సంపాదన ఆశించే చేసుకుంటా నంటున్నాడని నాకు తెలుసు' అన్నాను.

'శారదా, ప్లీజ్, వాడివిషయం ఆలోచించవద్దు....' అన్నాడు రంగ.

నిజానికి యింతవరకు పెళ్లిచేసుకోవాలనుకోలేదు. సుబ్బారావు మాటను పట్టించుకోలేదు.

'నేను నేనుగా నాసుఖంకోసం ఎప్పుడైనా ఒక్కపనైనా చేశానా? ....యిప్పుడు జీవితంలో settle అయ్యే అవకాశంవస్తే ఒద్దంటున్నావ్. నీవు selfish కాదా?' అన్నాను.

రంగ మాట్లాడలేదు. వెళ్ళిపోయాడు.

అమ్మ పడుకున్న వరండాలోంచి 'అమ్మాయ్, శారదా, కమలా....రండి, రండి' అంటూ అత్త తగ్గుస్వరంలో పిలుస్తూవుంది. వెళ్ళి చూశాను. అమ్మకు ఎగశ్వాస పుట్టింది. శూన్యంలోనికి చూస్తూ యాతన పడుతోంది. కమల ఏడుస్తోంది.

నాకు ఏడుపు రాలేదు. మళ్లీ లోపలికి వెళ్లాను.

అమ్మగురించి ఆలోచిస్తే మొదట నాకు జ్ఞాపకంవచ్చేది: నిజానికి నేను కమల కంటే రెండేళ్లే పెద్దయినా, నేను పెద్దదాన్ననీ, ఆమె సలహాలకతీతురాల్ననీ నా చిన్నప్పటినుండీ కూడ ఆమె అనుకోవటం. దానికి కారణమేమిటో నాకు తెలియదు. రెండో జ్ఞాపకం చిత్రమైనది. అది ఎందుకు నాలో అంతగా చోటుచేసుకుందా అని ఆశ్చర్యం కలుగుతుంది నాకే। అప్పుడు మా బడికి సెలవులు. అందరం భోజనాలు చేసి కూర్చున్నాం. మా యింట్లో పిల్లలు తమలపాకులు వేసుకునే అలవాటులేదు. ఎందుకో ఆరోజు వేసుకున్నాను నాలుక ఎర్రగా పండింది. అద్దంలో చూసుకున్నాను. మంచి నారింజ రంగులో పండింది. అమ్మ నా వైపు చూసింది, అయిష్టంగా. 'ఆ ఎర్ర పళ్ళతో శారద అచ్చు పల్లెటూరి అరవ మనిషి లాగా వుంది.... వొద్దంటే ఎందుకు ఆకులు వేసుకోవటం?' అన్నది. నాకు చాలా అవమాన మన్పించింది. అద్దంలో చూసుకున్నాను. నిజంగా నిత్యమూ ఆకులు నమిలే పల్లెటూరి అరవ మనిషిలాగా వున్నాను గారపళ్లతో। అమ్మ అన్నమాట కంటే ఆమెధోరణి నన్ను తీవ్రంగా గాయ పరచింది. అప్పటినుండీ మళ్ళీ తాంబూలం ముట్టుకోలేదు.

కాని యీ విషయం మాయని ముద్రగా నిలిచి పోయింది నాలో. నాన్నగారు ఒక మంచి పెళ్ళిసంబంధం గురించి నాతో చూచాయగా ప్రస్తావించినప్పుడూ మొదట నాకు జ్ఞాపకం వచ్చింది యీవిషయమే। వెంటనే పెళ్ళిచేసుకోనని చెప్పేశాను. నాన్న గారికి ఏ విషయమైనా చెప్పటం వరకూ తెలుసుగాని బలవంతం చెయ్యటం, తన అభిప్రాయం యితరులమీద రుద్దటం చేతకాదు. నేను అట్లా చెప్పాక ఎవరూ నన్ను పెళ్ళి చేసుకొనితీరాలని బలవంతం చేయ్యలేదు .... నాన్నగారు పోయాక నా జీవితం ఆలంబనం లేనిదై నిష్ఫలమైనదిగా అర్థరహితంగా కన్పిస్తోంది.

ఇప్పుడు అన్నీ జ్ఞాపకం చేసుకుంటే నాకో చిత్రమైన కోరిక కలిగింది— తాంబూలం వేసుకోవాలని। సీతయ్యను పిల్చి కొట్టుకు పోయి కిళ్లీ తెమ్మన్నాను. కిళ్లీ నములుతూవుంటే ఎంతో హాయనిపించింది........ కమలా వాళ్ల ఏడుపులు తగ్గ

స్థాయిలో విన్పిస్తూనే వున్నై.... ఇంతకాలం ఎందుకు నేను తాంబూలం వేసుకోలేక పోయాను?; ఏ సుఖం అనుభవించలేకపోయాను?; నేనుగా కోరి నాసుఖం కోసం ఏపనీ చెయ్యలేక పోయాను? అని ప్రశ్నించుకున్నాను. నన్ను ఏదో భూతం ఆవహించి నాచేత నాకోసం కాని పనులు చేయిస్తోంది! నన్ను పెళ్ళి చేసుకుంటాననే సుబ్బారావు జ్ఞాపకం వచ్చాడు. నలభైకి పైబడిన వయసు అయినా తెల్లగా అందంగా హుందాగా కన్పిస్తాడు. ఏం పెళ్లి చేసుకుంటే? అన్పించింది. 'శారదా ప్లీజ్, వాడివిషయం ఆలోచించొద్దు,....' అంటున్నాడు రంగ ... వెంటనే సుబ్బారావుకి వుత్తరం వ్రాయాలనిపించింది. యిప్పుడు వ్రాయకపోతే యిహ ఎప్పటికీ వ్రాయలేననీ అన్పించింది వ్రాశాను.... పెళ్ళి చేసుకుంటానని....

నా డబ్బు వుద్యోగం చూసి చేసుకుంటున్నాడు సుబ్బారావు. అయితేనేం? ఆమాటకొస్తే డబ్బుమీద కోరిక లేనిదెవరికి? నాన్నగారు చచ్చిపోయిన తర్వాత ఆయన పేరుతో వుండే కొద్దిపాటి భూమి నాకే వస్తుందేమో నన్నప్పుడు కమల ముఖం చూసి తీరాలి! నాకు చాల నవ్వు వచ్చింది. 'దుఃఖపడబోకు, యిద్దరం తీసుకుందాంలే సమానంగా' అన్నాను, రంగని జ్ఞాపకం చేసుకొని. కమల మొహం ముడుచుకొని, 'నీకేం సంసారమా, పిల్లలా? చక్కగా వుద్యోగం చేసుకుంటున్నావు చాలదా? నీకెందుకీ ఆస్తిపాస్తులు?' అన్నది. అమ్మకు ముద్దుల కూతురు గనుక అమ్మ పేరుతోవుండే రెండు లక్షల ఆస్తీ తనకే వస్తుంది అని తెలుసు. యీ కొంచెం కూడా నాకు రాగూడదనే దురాశకు నాకు కోపం వచ్చింది. యింతలో అమ్మనాతో 'హైదరాబాదులో మంచి యిల్లుచూసి కొనుక్కోరాదూ?' అన్నది.

'అంత భాగ్యం లేదులే. నాకు అంత డబ్బు ఎక్కణ్ణుంచి వస్తుంది? మానాన్న పేదవాడు కదా' అన్నాను.

అమ్మను నొప్పిద్దామనే అన్నానేమో. ఆమె మాట్లాడకుండా వూరుకున్నది మాట్లాడితే తనదేమైనా యివ్వవలసి వస్తుందేమోనని!

సుబ్బారావు వుత్తరం కవర్లోపెట్టాను. యింతలోగా రంగ వచ్చాడు.

'త్వరగా రా. అత్తయ్య చచ్చిపోతూవుంటే తీరిగ్గా కిళ్ళీ నములుతూ వున్నావా ఏం మనిషివి, లే ...' అన్నాడు కోపంగా.

నేను వెళ్ళేసరికి అమ్మను మంచం మీదనుండీ క్రింద వరిగడ్డి మీదకు మార్చారు. నోట్లో తులసినీళ్లు పోశారు. చెవిలో నారాయణ నామం చెప్పారు. అమ్మ ప్రాణవాయువు అనంతవాయువులో కలిసిపోయింది.

అందరి ఏడుపుల మధ్యా నాలో చెప్పలేని, ఏడుపుకాని, పెను తుఫాను. నా నోట్లో తాంబూలం వుంది యింకా....

దహనక్రియ లయ్యాక అమ్మ వ్రాసిన విల్లు బయటికితీశారు. సగం ఆస్తి కమలకూ, సగంనాకు— హైదరాబాదులో మేడ కొనే నిమిత్తం— వ్రాసింది.

అది వినగానే నిశ్చేష్టనై పోయాను. నాలోని చైతన్యమంతా జారి పోయినట్లు నీరసం కలిగింది.

ఎందుకిట్లా వ్రాసింది? ఎందుకు? అనుకున్నాను. నాకేదో అన్యాయం జరిగి పోయినట్లు, నా ఆస్తినంతా ఎవరో దోచుకున్నట్లు బాధ కలిగింది. నా జీవచైతన్యమే స్తంభించి పోయింది. నిన్నటి తాంబూలం తాలూకు గార మాత్రం మిగిలింది పళ్లమీద.

నీరసంగా సుబ్బారావుకు వ్రాసిన వుత్తరం చించి పారేశాను. గదిలో తలుపులు మూసుకొని కూర్చున్న నాలో అర్థంకాని మూగవేదన కట్టలుతెగి కన్నీరుగా ప్రవహించింది.

అమ్మ చచ్చి పోయింది!

.... .... .... .... .... .... .... .... ....

.... .... .... .... .... .... .... .... ....

జీవితం మళ్ళీ మొదలు!!